## మంచి వార్త

# మహోన్నతం తాళ వృక్షం



**తమిళనాడు** రాష్ట్రం కన్యాకుమారి దగ్గర్లోని పొట్టవిళై గ్రామానికి చెందిన ఎస్. అంబయన్ కల్లుగీత కుటుంబానికి చెందిన వ్యక్తి. ఆయన తన చిన్నతనంలో తండ్రి సంగిలి నాడార్ వెంట కల్లు సేకరణకు తాళ్లవనానికి వెళ్లేవాడు. అలా యువకుడిగా ఉన్నప్పుడే తండ్రి నుంచి తాళ్లు ఎక్కే విద్యను ఒడుపుగా నేర్చుకున్నాడు. ఇదిలా ఉంటే ఇక 2020లకు వచ్చేసరికి తమిళనాడు రాష్ట్ర వృక్షమైన తాటిచెట్ల సంఖ్య తగ్గిపోవడాన్ని అంబయన్ గమనించాడు. కల్లుగీత కార్మికులపై ఇది ప్రతికూల ప్రభావం చూపించడం మొదలైంది. 67 ఏండ్ల అంబయన్‌ను ఈ పరిస్థితి కలచివేసింది. దీంతో ఆయన చెట్టు ఎక్కే పరికరాలను పట్టుకున్న చేత్తోనే కలం పట్టుకున్నాడు. భావితరాలకు తాటి చెట్లు, వాటి ఉత్పత్తులు, కల్లుగీత కార్మికుల కథలను అక్షరబద్ధం చేయడానికి శ్రీకారం చుట్టాడు. అలా ఏడో తరగతితోనే చదువు ఆపేసిన అంబయన్ చేతినుంచి 'పాణై యోడు ఉరవాడు' పేరుతో పుస్తకం రూపుదిద్దుకొంది. ఇందులో తాటిచెట్ల పెంపకం, వాటినుంచి కల్లుతీయడం, కారుపట్టి, పాణం కర్కండు లాంటి తాటి ఉత్పత్తులను తయారుచేయడం గురించి ఆయన వివరించాడు. సాధారణంగా కల్లుగీత కార్మికులు చెట్టు నుంచి కల్లును సేకరిస్తారు. దాన్ని తాజాగా ఉన్నప్పుడే తాగేయాలి. కాగా ఇదే నీరును మరిగించి కారుపట్టి, పాణం కర్కండు తయారుచేస్తారు. వీటితోపాటు తాటి ఆకులతో టోపీలు, చాపలు చేయడం గురించి కూడా అంబయన్ తన పుస్తకంలో వివరించారు. అలా తన పుస్తకం నవతరానికి తాటిచెట్ల గొప్పతనం తెలుసుకోవడానికి ఉపకరిస్తుందని అంబయన్ అభిప్రాయం. ''తాటి ఉత్పత్తులు కేవలం ఆహారం మాత్రమే కాదు. అవి ఔషధాలు. ఇప్పుడవన్నీ గత చరిత్రగా మిగిలిపోతున్నాయి'' అని ఆయన ఒకింత నిరాశకు లోనవుతాడు. అందుకే ఇప్పటి తరానికి తాటిచెట్ల గురించి అవగాహన కల్పించడానికి అంబయన్ ఏకంగా ఓ బృందాన్నే తయారుచేశాడు. వారికి చెట్లు ఎక్కడం, తాటి ఉత్పత్తుల తయారీలో శిక్షణ ఇచ్చాడు. తాటిచెట్ల ప్రాముఖ్యంపై అంబయన్ రచనకు కన్యాకుమారికి చెందిన ఎలైకల్ లిటరరీ అసోసియేషన్ ప్రశంసలు కూడా దక్కాయి. పరిశోధకులు తాటిచెట్ల గురించి విజ్ఞానశాస్త్ర పరంగా ఎంతో సమాచారం అందించి ఉండొచ్చు. కానీ అంబయన్ మాత్రం తన జీవితంలో గమనించిన విషయాలను పుస్తకంగా తీసుకువచ్చాడు. ఇందులో ఆయన జీవిత కాల శ్రమ దాగుంది. నిజమే మరి... తెలుగు సాహితీవేత్తలు కల్పవృక్షంగా కీర్తించిన తాటిచెట్టు చిరకాలం బతకాలంటే ఇప్పటితరాలకూ దాని ప్రాధాన్యం గురించి తెలియాల్సిందే.

## వైతాళికుల వాణి

ఓ కలను సాకారం
చేసుకోవడాన్ని అసాధ్యంగా
మార్చేది ఒక్కటే ఒక్కటి...
అది ఓడిపోతామేమో
అనే భయం.

• **పాలో కొయెల్హో**
(ప్రసిద్ధ రచయిత)

## క్యా సీన్ హై!

